## ఈవారం కథ

# డ్యూటీ

— టి.సి. పద్మావతి

ఆ వార్త తెలియగానే ఎగిరి గంతులేయాలనిపించింది. మా ఆఫీసులో కొమ్ములు తిరిగిన మగరాయుళ్లే – ఆ విషయం తెలిసిన వెంటనే, బాంబుపడ్డట్లు వులిక్కిపడి, ఎం.ఆర్.ఓ. ఆఫీసుకు పరుగెత్తి – వాళ్ళ చేతులు, కాళ్ళు పట్టుకుని ఆ డ్యూటీ కాస్త 'కేన్సిల్' చేయించుకునే ప్రయత్నంలో తలమునకలై వున్నారు.

అదేం చిత్రమో! నాకు మాత్రం మహదానందమైంది. పైపెచ్చు 'డ్యూటీ' వేయరేమోనని దిగులు కూడ పెట్టుకున్నాను. 'ఆడది'కదాని జాలి తలిచి వొదిలేస్తారేమోనని నా దిగులు. ఆడాళ్ళు లేనిదే, ఆ వొచ్చే మగాళ్ళు కూడా రారని ప్రభుత్వానికి తెలీదూ?

నాతోపాటు మణెమ్మ, విజయలక్ష్మి, పద్మజలకు కూడా డ్యూటీ పడింది. అదృష్టం బావుండి అందర్నీ ఒకే వూరు వేశారు. 'బూతులు' మాత్రం వేరు.

సంగతి తెలుసుకుని ఒకరిద్దరు మీసమున్న మగాళ్ళు పరామర్శించారు. మేమేదో కష్టాల ఊబిలో కూరుకుపోయినట్లు మా వొంక జాలి, జాలిగా చూశారు. అది చదువు సంధ్యలేని పల్లెటూరని, గ్రామకక్షలు, తగాదాలు వుంటాయని. ఆడాళ్ళు ఏమైపోతారో పాపం.. అన్నట్లు సానుభూతి వాక్యాలు కురిపించారు.

"మీరు 'వూ' అనండి. కేన్సిల్ చేయిద్దాం" అన్నారొకరు.


"ఎందుకు. మీరే వెళ్ళి అడగండి. దెబ్బకు కేన్సిల్ చేస్తారు. ఈ దేశంలో పెద్ద పెద్ద పనులు ఆడాళ్ళ ద్వారా ఇట్టే అయిపోతున్నాయి. ఇదో లెక్క!" అన్నారు మరొకరు.

వాళ్ళ మాటలు విన్నాక విజయలక్ష్మి కాస్త మెత్తబడింది. నా మొహంలోకి కాస్తంత భయంగా చూసింది.

"వీళ్ళ బొంద వీళ్ళకేం తెలుసు. మన ఏరియాలో భయం లేదే. కడపవైపు అయితే కాస్త జంకాలి. వీళ్ళని మన వూరు వేయలేదు. అందుకే ఈ తిప్పలు" అని సర్దిచెప్పాను.

"కరెక్ట్. మనం వెళ్తున్నాం. ఆ పైరగాలి, ఆ చల్లదనం అనుభవిస్తున్నాం. మీరు మాట్లాడకుండా అందరూ మూటాముల్లె సర్దండి" తేల్చేసింది మణి.

మణి ఒ.కె. అంటే ఇహ తిరుగేముంది? పద్మజ, విజయలక్ష్మి కూడా తలలూపారు.



నా మనసు మారుమూలల కదలాడుతున్న తెలీని బాధ సగం తీరినట్లయింది.

"అయితే ఒక్క షరతు" అంది మణి.

ఏమిటన్నట్లు చూశాం.

"మనం బయల్దేరింది మొదలు తిరిగి వొచ్చేవరకు పద్మజ నవ్వుతూ వుండాలి"

ఆ మాటతో పద్మజ చిరునవ్వులు చిందించింది.

"అలాగే విజయలక్ష్మి ఒక్క నవ్వు కూడా నవ్వకుండా సీరియస్‌గా వుండాలి" అంది మణి.

విజయలక్ష్మి ఎప్పుడూ చిరునవ్వుతో వుంటుంది. ఆ నవ్వులో చల్లని ఆత్మీయత, స్నేహం వుంటాయి. పద్మజ ఎప్పుడూ గంభీరంగా, నిలకడైన చూపుతో వుంటుంది. చూట్టానికి సీరియస్‌గా వున్నట్టు కనిపిస్తుంది కాని చాలా మంచి అమ్మాయి. వాళ్ళనెప్పుడూ అలా అల్లరి చేస్తుంటుంది మణి.

"అబ్బో! చాలా కష్టం" అన్నాను.

"వంద పందెం. వుంటారని" అంది మణి.

"సరే" అన్నాను.

"దానితో పందెం పెట్టుకోకు. వోడిపోతాం. నేను ఓడిపోయాను. మొన్ననే వంద రూపాయిలు సమర్పించుకున్నాను" అంది పద్మజ.

"ఏ విషయంలో" అడిగాను.

పద్మజ మాట్లాడలేదు.

"భర్త విషయంలో కొత్త పెళ్ళికూతురు కదా! ఈ వారం మా వారు రావన్నారు అని మణితో చెప్పింది. శనివారం కల్లా దిగబడతారు చూడు అంది మణి. కాదు. ఖచ్చితంగా చెప్పారు అంది. పందెమంటే పందెం అనుకున్నారు. మణి గెలిచింది" అంది పెద్దగా నవ్వుతూ విజయలక్ష్మి.

మణి కాలర్ ఎగరేసింది.

"సరేలే తల్లీ. ఇంతకీ మనం ఎలా బయల్దేరాలి" అంది పద్మజ.

"బిట్రగుంట వరకు బస్సు అక్కడ్నించి మూడు కిలోమీటర్లు. ఆటోగాని, గుర్రబండిగాని ఎక్కుదాం" అన్నాను.

"అబ్బ. నేను గుర్రం మీద కూచొంటా" అంది మణి.

"బిట్రగుంట మండలం చూసే శీను వున్నారు కదా. ఏదైనా జీప్ ఎరేంజ్ చేస్తారేమో" అంది విజయలక్ష్మి సాలోచనగా.

"ఏమీ వద్దు. మనం హాయిగా బస్సులో జట్కాలో వెళ్దాం" అన్నాను.

** ** **

బస్‌లో కిటికి ప్రక్కన కూచొన్నాను. చల్లనిగాలి శరీరాన్నే కాదు మనసును కూడా తాకుతోంది పచ్చని పైరు, దూరంగా కొండలు... మనసును సేద దీరుస్తున్నాయి. ఈ మధ్య అకారణంగా ఏర్పడిన ఏదో తెలీని బాధ నుంచి తాత్కాలికంగా వుపశమనం కలిగినట్లయింది.



## ఇరుకు గది

పారేసుకున్న నీ జ్ఞాపకం
పిండారబోసిన వెన్నెల్లో
గోదారి తరగలా వచ్చింది
చిరునవ్వుకే దిగులు నేర్పింది



వయసు కరిగే వెన్న
వలపు అంతేనమ్మా
తలుపు తీసే వున్నా
మనసు ఇరుకేనమ్మా

—యండమూరి వీరేంద్రనాథ్

(భార్యాగుణవతి శత్రు)
(టి.వి. సీరియల్ నుంచి)

మీరు నమ్ముతారో, లేదో!

ప్రతి వ్యక్తి జీవితంలో ఇలాంటి మానసిక స్థితి కలుగుతుందో లేదో – తెలీదుకాని, నాకు మాత్రం ఏర్పడింది.

ఏమిటో తెలీదు. 'ఫలానా' అని తెలీనే తెలీదు.

ప్రేమగా చూసుకునే భర్త, మంచి అత్తగారు, పిల్లలు... నాలుగంకెల జీతం.. ఇంట్లో పని పిల్ల.. ఫ్రిజ్... ఎయిర్ కూలర్.. మిక్సీ... అన్నీ సవ్యంగా అమరాయి. ఇంకేం కావాలి? ఈ దేశంలో ఒక ఆడపిల్లకు ఇంతకంటే ఏం కావాలి?

కానీ ఏదో అసంతృప్తి. సున్నితంగా మనసును మీటుతున్న బాధ. స్వచ్ఛమైన మెరుపు తర్వాత ఏర్పడే చీకటి. అదేమిటో స్పష్టంగా తెలీదు. అందుకే ఎక్కడికైనా ఒంటరిగా పారిపోవాలనే కోర్కె. ఎక్కడికి వెళ్ళగలను? నన్నల్లుకున్న ఇంత మందిని వొదిలి?

అదృష్టవశాత్తు 'ఎలక్షన్ డ్యూటీ' ఒకటి వొచ్చి పడింది. మరో సమయంలో అయితే ఎలా వుండేదో చెప్పలేను గాని ఇప్పుడు మాత్రం మహదానందంగా వుంది.

మణి, పద్మజ, విజయలక్ష్మి కబుర్లు చెప్పకుంటున్నారు. నేను మాత్రం ఎగిరే ముంగురులను కూడ సవరించుకోకుండ అలా ప్రకృతిని చూస్తుండిపోయాను.

బిట్రగుంట రానే వొచ్చింది.

చక్కని పల్లెటూరు వాతావరణం. అల్లంత దూరంలో అగుపిస్తూనే వుంది.

మాతోపాటు కొంత మంది దిగారు. వాళ్ళూ ఎలక్షన్ డ్యూటీకే అయి వుండాలి.

రెడీగా ఆటోలున్నాయి. ఒకటి, రెండు జట్కా బళ్ళున్నాయి.

"ఉమా మహేశ్వరవురం ఎటెళ్ళాలి" మణి మాటలు గొంతులో వుండగానే ఆటో డ్రైవర్లు చుట్టుముట్టారు.

శుభ్రంగా వివరాలన్నీ తెలుసుకుని తీరిగ్గా జట్కా బండి ఎక్కి కూచున్నాం.

అందరూ నోళ్ళు తెరిచి చూస్తుండగా జట్కా కదిలింది.

పంట కాలువ ప్రక్కగా, మంచి నిమ్మతోటల ప్రక్కగా.. అలా జట్కాలో ప్రయాణం ఎంత హృద్యంగా వుందో చెప్పలేను.

"పల్లెకుపోదాం.. పారుని చూద్దాం.. ఛలో.. ఛలో" మణి పాట అందుకుంది. విజయలక్ష్మి చిరునవ్వుతో, నేను పళ్ళన్నీ బైటపెట్టి పెద్ద నవ్వుతో వుంటే, పద్మజ మాత్రం కళ్ళతో నవ్వుతోంది. జట్కాతోలే అతను కూడా నవ్వుతుండాలి. ఆ సాయం సంధ్యలో మా నవ్వులు పువ్వులై విరుస్తున్నాయి.

"ఒసేవ్. ఈ ఉద్యోగం, సద్యోగం వొదిలి. మొగుణ్ని లేవుకొచ్చుకుని ఈ తోటల్లో ఒక గుడిసె వేసుకుంటే అది కదా లైఫ్ అంటే" మురిసిపోయింది మణి.

"ఏమిటే అందరూ 'కీ' యిచ్చిన బొమ్మల్లా నవ్వుతూ కూచున్నారు. నా మాటలు బుర్రకెక్కాయా?' '

"ఎక్కాయి తల్లీ. అలాగే చేద్దాం. మొగుళ్ళు వొస్తారా? అని ఆలోచిస్తున్నాను" అన్నాను సీరియస్‌గా.

"రాకేం చేస్తారే. గంగలో దూకమన్నా దూకరూ? ఇంకా ఆ మాత్రం ట్రైనింగ్ ఇవ్వలేదా? ఏమంటావ్ పద్మజా"

"నాకు తెలీదు తల్లీ" అంది ముసిముసిగా.

"ముందు ముందు తెలుస్తుందిలే"

మా మాటలతో, అల్లరితో ఉమామహేశ్వరవురంలోకి ప్రవేశించింది జట్కా. బిందెలతో, కుండలతో నీళ్ళు తీసుకు వొస్తున్న పల్లె పడచులు స్వాగతమిస్తున్నారు. చొక్కాల్లేకుండా, మనసులో కల్మషం లేకుండా అల్లరిగా ఎగురుతున్న పసిపిల్లలు ఆహ్వానిస్తున్నారు. మరో లోకంలోకి అడుగు పెట్టినట్లుగానే వుంది.

ఆ వూరు స్కూలుదగ్గర జట్కా ఆగింది.

తెల్లారితే. అక్కడే జనం ఓట్లు వేసేది.

మేము దిగేసరికి ఎదురుగా – కృపాకర్, సుబ్బారావు, రమణయ్యగారు.

"ఏమ్మా! ఒక్క మాట చెప్పి వుంటే అందరం కలిసి వొచ్చేవాళ్ళం కదా! ఇబ్బంది పడ్డారా?" ఆప్యా

యంగా పలకరించారు రమణయ్య.

"పదండి మేడమ్. అటెండెన్స్ తీసుకుంటున్నారు" అని టక్ సర్దుకున్నాడు కృపాకర్.

అందరం సంతకాలు పెట్టి వొచ్చి, బైట బల్ల మీద కూచున్నాం.

పెద్ద 'షామియానా' వేశారు. అక్కడే ఐదారు బూతులు ఏర్పాటు చేస్తారట. పంచాయితీ ఎలక్షన్లు కాబట్టి మధ్యాహ్నానికల్లా ఐపోవచ్చని అనుకుంటున్నారు.

రాత్రికి పడక ఆ స్కూలే.

చచ్చాం. మరి చేసేదేముంది?

మా లగేజి ఒక మూలపెట్టి, అలా ఓ రౌండ్ వేద్దామని వూర్లోకి బయల్దేరాం.

మా పకపకలతో ఆ సాయంకాలం – పల్లె పల్లె ఉదయించినట్లయింది.

చిన్న చిన్న వీధులు. ఊరుమధ్య దేవాలయం. పెద్ద అరుగులు. వందల వసంతాలు చూసిన వేప చెట్లు.. ముచ్చటగా వుంది ఆ చిన్న పల్లెటూరు.

మధ్యలో రమణయ్యగారు కలిసి ఆ వూరు విశేషాలు చెప్పారు. రమణయ్యగారి సొంత వూరు అదేనట. పాతికేళ్ళ క్రితం ఆ వూరు వొదిలి వొచ్చేశారు. తన బాల్యం ఎలా గడిచిందీ చెప్తుంటే ముచ్చటేసింది. వూరు పెద్దలు మధ్యలో రమణయ్యగారిని పలకరిస్తున్నారు.

"అమ్మా! మీరు ఆడపిల్లలు. ఆ స్కూల్‌లో పడుకోలేరు. మా బంధువులు వున్నారు. అక్కడ వుండండి" అన్నారు.

సాక్షాత్తు భగవంతుడే రమణయ్యగారి రూపంలో వచ్చినట్లయింది.

మగాళ్ళకు కోపం వొస్తే వొచ్చింది గాని, కనీసం ఆడాళ్ళకైనా వసతి చూపించాల్సిన బాధ్యత ఈ అధికార్లకు లేదూ?

భలే వుంటుందని వొచ్చినందుకు మా తిక్క తీరిపోయి వుండేది – సమయానికి రమణయ్యగారు కనిపించకపోతే. మొత్తానికి భగవంతుడున్నాడు – ముఖ్యంగా ఆడాళ్ళకు.

ఉదయం ఆరింటికల్లా వొచ్చి 'మెటీరియల్' ఎరేంజ్ చేసుకోవాలని మా ఆఫీసర్లు సెలవిచ్చారు. అలాగేనని లగేజ్‌తో బైటపడ్డాం.

పెద్ద పెంకుటిల్లు. ముందు విశాలమైన స్థలం. బలంగా వున్న నాలుగు కొబ్బరి చెట్లు. ఆ చెట్ల మధ్య మాకు మంచాలు వేశారు. ఇలా ఆరుబైట మంచం మీద పడుకుని ఎంత కాలమైందో! తలుపులు బిగించి 'ఫేన్' కింద పడుకోవటమే కదా! తలుపులు మూస్తే, తలపులు కూడా మూసుకుంటాయని ఎక్కడో చదివాను.

మా 'కొలీగ్స్' సుబ్బారావు, కృపాకర్ వచ్చారు. కాసేపు సరదాగా కబుర్లు.. అందరం ఇక్కడే వుందామన్నారు రమణయ్య. "మేము పేకాడుకోవాలి బాబూ! మమ్మల్ని వొదిలేయండి" అని వెళ్ళిపోయారు.

రమణయ్యగారు కూడా అలా వూర్లోకి వెళ్ళారు.

నలుగురం మంచాలకు అడ్డంగా పడ్డాం.

లేత వెన్నెల్లో కొబ్బరాకు చివర్లు మెరుస్తున్నాయి. చల్లగాలికి కళ్ళు మూతలు పడుతున్నాయి.

డొక్కలో ఒక్కపోటు పొడిచింది మణి.

"కుయ్యో"మన్నాను.

"ఏమిటి సంగతి? శ్రీవారితో గొడవ పడ్డావా?" అడిగింది చిన్నగా.

నాకేమీ అర్థం కాలేదు. వెర్రిమొహంతో చూశాను.

"ఆర్డర్స్ రాగానే మీ వారికి చెప్పి 'కేన్సిల్' చేయిస్తావనుకున్నాను. పవ్వ ముద్దలా వుండేదానివి. కుర్రపిల్లలా మాకంటే ముందు రెడీ అయ్యావు. సంసారం బోర్ కొట్టిందా?"

దాదావు మర్చిపోయాననుకున్న విషయం మళ్ళీ గుర్తు చేసిందీ పిల్ల. ఎలా చెప్పను. ఏదో తెలీని అసంతృప్తి మనసును పట్టి పీడిస్తుందని. చెప్పినా నమ్ముతుందా? ఏవేవో అర్థాలు తీసుకోరూ! అదీగాక మా ఆఫీసులో ఎవరితోనూ పూర్తిస్థాయి స్నేహం చేయలేదు నేను.

"మరి నువ్వెందుకొచ్చావ్?" అడిగాను నవ్వుతూ.

"నిన్ను వొదిలి వుండలేక"

"నేనూ అంతే"

"ఏమిటే మీ గుసగుసలు. ఆత్మారాముడి సంగతి చూడండి" అంది పద్మజ.

"ఈ వెన్నెల, ఈ గాలి చూస్తుంటే ఆకలెలా గుర్తువస్తుందే. ప్చ్. బొత్తిగా కళాపోసన లేదు" అంది విజయలక్ష్మి.

## పాత్రోచిత లక్షణం

ఒక చిత్రంలో ముక్కామల దుర్వాసుని పాత్రలో మేకప్ పూర్తి చేసుకొని రెడీగా వున్నారు. ఆ సీనులో నటించే రాజబాబు గంట గడిచినా రాలేదు. ఇంతలో ఆ చిత్ర నిర్మాత ముక్కామల దగ్గరకు వచ్చారు. "ఎంత సేపు రాజబాబు కోసం ఎదురు చూడమంటారు? నేను మేకప్ తీసేసి ఇంటికి వెళ్ళిపోతాను" అన్నారు ముక్కామల ధుమ ధుమ లాడుతూ.

ఎప్పుడూ ముక్కామల కోపం చూడని ఆ నిర్మాత కంగారుపడిపోయి. "అనివార్య కారణాల వల్ల ఆలస్యంగా వస్తానని రాజబాబు ఫోన్ చేశారు. మీకింత కోపం రావడం నేను ఎప్పుడూ చూడలేదు" అన్నారు.

"ఏం చెయ్యమంటారు? ఈ చిత్రంలో దుర్వాసునిగా నటిస్తున్నాను కదా! ఆయన లక్షణాలు కాస్తయినా నాలో లేకపోతే ఎలా చెప్పండి" అన్నారు చిన్నగా నవ్వుతూ ముక్కామల.

సెట్లో వున్న వారందరూ నవ్వారు!

సేకరణ: భూక్యాగోపీనాయక్.

మా మాటలు విన్నాడో! ఏమో!

సన్నగా, బలంగా వున్న ఓ కుర్రాడు నాలుగు కొబ్బరి బొండాలు తీసుకొచ్చాడు – చిరునవ్వుతో.

కొబ్బరికాయలో అన్ని నీళ్ళుంటాయని నాకు తెలీదు.

నాలూపాయలు పెట్టి ఎవ్వరైనా కొంటే – నోరు తడిపేంత నీరు గొంతు దిగేది. కడుపు నిండిపోయిందంటే నమ్మండి. గుడ్ గాడ్– ఎంత టేస్ట్‌గా వున్నాయో!

మరో నాలుగు కాయలు తెస్తానంటే. 'వొద్దులే బాబూ' అని బ్రతిమాలి పంపించాం.

ఆత్మారాముడు శాంతించాడు.

ఆకాశం క్రింద పడుకుని, నక్షత్రాలతో కబుర్లాడుతుంటే – చిన్నన బాల్యం గుర్తువొచ్చింది. వెన్నెల్లో దొంగాటలు. తొక్కుడు బిళ్ళ ఆటలు.. చిరు చెమటలు.. పెద్దనవ్వులు.. ఓహ్! ఎంత మధురం బాల్యం.

ఎవళ్ళకి వాళ్ళం ఆలోచనలతో మైమరచిపోయాం.

ఎంత కాలం గడిచిందీ తెలీదు.

రమణయ్యగారు వొచ్చి భోజనానికి రమ్మని పిలిచారు.

పెద్దగా ఆకలి లేకున్నా వెళ్ళాం.

తిరిగి వొచ్చి అక్కడే పడుకున్నాం. మాకు తోడు ఒక పెద్దాయన రమణయ్యగారు వాళ్ళు కబుర్లలో పడ్డారు.

మణి ఏదో అడుగుతుంటే పద్మజ, విజయలక్ష్మి సమాధానం చెప్తున్నారు. నా మనసు ఎక్కడో వుంది. ఎప్పుడు నిద్రాదేవి కౌగిలిలోకి జారుకున్నానో గుర్తు లేదు.


** ** **

ఉదయం ఆరింటికల్లా రెడీ ఐ స్కూలు దగ్గరకు వెళ్ళాం. ఆ షామియానా క్రింద, స్కూలు గదిలో ఆరేడు బూతులు రెడీ చేసుకున్నాం. ఒక్క బూతుకు నలభై మంది ఓటర్లు ఏ మాత్రం గొడవ లేకుండా సాఫీగా ఓటింగ్ కార్యక్రమం జరిగిపోయింది. పద్మజ యిచ్చిన 'చిక్‌లెట్స్' బుగ్గన పెట్టుకుని తాపీగా మా బాధ్యత నెరవేర్చాం. చివర్లో కృపాకర్ బూతు దగ్గర చిన్న గొడవ జరిగింది. అది సర్దుబాటు కావటానికి అరగంట పట్టింది. వుత్త మాటలే! పాపం ఆ వూరుజనాలు మంచివాళ్ళు, అమాయకులు.

అప్పటికప్పుడే 'కౌంటింగ్' చేస్తున్నారు. పోలింగ్ ఆఫీసర్స్, ఊరు పెద్దలు ఎలక్షన్ ఏజంట్లు అందరూ అందులో భాగం. మా పని ఏమీ లేదు. కౌంటింగ్ జరుగుతుంది కాని 'అఫిషియల్‌గా' ఎవరు గెలిచిందీ చెప్పరు. అంటే – బహిరంగ రహస్యం ఈ పద్ధతి బావుందనిపించింది.

ఆ గొడవలో మేమెందుకని, శుభ్రంగా వేపచెట్టు

## కొంచెం ప్రేమ



కొంచెం కొంచెం కొంచెం కొంచెం
కొంచెం కొంచెం కొంచె కొంచెం... నవ్వొస్తుంది

కొంచెం కొంచెం కొంచెం కొంచెం
కొంచెం కొంచెం కొంచెం కొంచెం ... దిగులేస్తుంది

ప్రేమిస్తేనే ప్రేమలో పెడితేనే – అది తెలుస్తుంది.

– యండమూరి వీరేంద్రనాథ్

క్రింద మంచం వేసుకుని కూచున్నాం. తోటల్లోని బంగినపల్లె మామిడికాయలు ఓ ముసలమ్మ తెస్తుంటే తలా ఓ రూపాయి యిచ్చి కొనుక్కుని వాటి పని పట్టడం మొదలు పెట్టాం. ఎంతో రుచిగా వున్నాయి. అదే కాయ ఐదు రూపాయిలకు గాని రాదు. పల్లె పల్లె, పట్నం పట్నమే!

సాయంత్రం నాలుగింటికి 'ఓట్ కౌంటింగ్' పూర్తయింది. గెలిచిన వాళ్ళు ఆనందంతో గెంతులు వేస్తున్నారు. ఇహ మా కార్యక్రమం ఏమీ లేదు. 'ఎలక్షన్ బస్' కోసం ఎదురు చూట్టమే!

ఈలోపు, మా లగేజ్ తెచ్చుకుందామని రాత్రి మేము బసచేసిన చోటుకి వెళ్ళాం. రమణయ్యగారు కూడా మాతో వచ్చారు.

అప్పుడు జరిగిందొక సంఘటన. అదే నా సమస్యకు పరిష్కారమవుతుందని నేను వూహించలేదు.

ఇంటివారు ఇచ్చిన కాఫీ తాగుతూ మధ్య మధ్యలో 'థాంక్సు' చెప్తూ, లగేజి బైట పెట్టుకుంటున్నాం.

అంతలో హడావుడిగా ఆవిడ వచ్చింది. చాలా దూరం నుంచి వొచ్చినట్లుంది.మనిషి కాసింత అలసటగా వుంది. నాలుగు పదుల జీవితాన్ని చూసిన అనుభవం ఆమెలో వుంది. మా వొంక నిశితంగా చూసి–

"రమణయ్య వున్నాడా?" అని అడిగింది.

మేము చూపిస్తున్నంతలో రమణయ్యగారే మా దగ్గరకు వచ్చారు.

ఆమె వొంక పరిశీలనగా చూసి ఆశ్చర్యంతో నోరు తెరిచారు.

"శం..క..ర..మ్మ" అప్రయత్నంగా అన్నారు.

"హమ్మయ్య. గుర్తుపట్టావు. అదే పది వేలు. నువ్వు వొచ్చావని వూళ్ళో అనుకుంటున్నారు. పొద్దున్నే వద్దామనుకున్నాను. పిల్లలు. పని, ఓటు... అన్నీ చూసుకునేసరికి ఇప్పడైంది. ఎలా వున్నావు.. పిల్లలెంత మంది? ఎక్కడ వుంటున్నావు?" అని గబగబ అడిగేసింది.

మాట్లాడుతున్నంతసేపు ఆమె కళ్ళలో నీరు కదలాడుతూంది. ముఖంలో అనిర్వచనీయమైన ఆనందం తాండవిస్తోంది. పాపం రమణయ్యగారి పరిస్థితి కూడా అలాగే వుంది. దారి తప్పిన ఇద్దరు మిత్రులు అనుకోకుండా కలిసినట్లు వుంది వాళ్ళ పరిస్థితి.

ఆవిడ ప్రశ్నలకు రమణయ్యగారు తీరిగ్గా సమాధానాలు చెప్పారు.మధ్యలో కళ్ళజోడు తీసి కళ్ళు తుడుచుకున్నారు.

కొబ్బరాకు నీడల్లో వాళ్ళు అలా మాట్లాడుకుంటూ వుంటే 'క్యాసిన్ హై' చూస్తున్న ప్రేక్షకుల్లా మేమూ మిగిలిపోయాం. వాళ్ళ మాటల్లో మాకు అర్థమైంది ఇది – ఆ వూర్లో దాదాపు ముప్పై సంవత్సరాల క్రితం చదువుకున్న పిల్లల్లో వీళ్ళిద్దరూ వున్నారు. కొంత చదువు అక్కడ, మరి కొంత ఐదు మైళ్ళ దూరంలో వున్న చిట్రగుంటకు ప్రతిరోజు ఉదయం నడిచివెళ్ళి సాయంత్రం నడిచి వొచ్చి చదువుకున్నారు. తర్వాత దాదాపుగా అందరూ విడిపోయారు. శంకరమ్మ రెండు మైళ్ళ దూరంలో వున్న 'నాగులేరు' నుంచి వొచ్చి వీళ్ళతో కలిసి బడికి వెళ్ళేది. ఎవరో చెప్తే బాల్యమిత్రున్ని చూద్దామని పరుగెత్తుకొచ్చింది.

"ఏరు దాటి వొచ్చావా?" అడిగారు రమణయ్య.

"ఏరు దాటి స్నేహితున్ని చూస్తే కలిగే ఆనందం, ఏరోప్లేన్‌లో వెళ్ళి చూస్తే వొస్తుందా?" మా వైపు చూచి నవ్వింది శంకరమ్మ.

"అహా! ఏం చెప్పారండి. మళ్ళీ చెప్పండి" అని అదే మాట మళ్ళి చెప్పించుకుంది మణి.

"జీవితంలో అన్నీ కొనుక్కోవచ్చు. కాస్త ఎక్కువ డబ్బులు పెడితే–మంచి కందిపప్పు, మంచి మొగుడు, మంచి ఇళ్ళు, మంచి భోజనం అన్నీ దొరుకుతాయి. మంచి స్నేహం మాత్రం దొరకదమ్మా చదువుకున్నోళ్ళు – మీకు తెలియందేముంది?" పొద్దుపోతోంది. మరి నేను వొస్తాను" అని రమణయ్యగారితో చెప్పి వెళ్ళిపోయింది.

బస్‌లో కూచున్నామేగాని నా మనసంతా శంకరమ్మ చెప్పిన మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. నన్ను పట్టుకుని ఆ చెంపా ఈ చెంపా వాయించినట్లయింది. ప్రాణప్రదంగా స్నేహించిన లత నా కళ్ళ ముందు నిలిచింది. ఎన్ని వుత్తరాలు రాసింది. ఒక్కదానికీ బదులు ఇవ్వలేదు నేను. నా సంసారంలో, నా సంపాదనలో చాలా తృప్తిగా వున్నాననే భ్రమలో వుండిపోయాను. నా దుఃఖాలు, సంతోషాలు నాలో నేనే అనుభవిస్తూ – ఆ కారణంగా మంచి స్నేహితురాల్ని దూరం చేసుకున్నాను. నా అసంతృప్తికి కారణం ఇదే. అస్పష్టంగా తెలుస్తున్నా అంగీకరించటానికి మనసు అంగీకరించలేదు. ఈ రోజు స్వచ్ఛమైన ఆ పల్లెటూరు ఆమె అంతకంటే స్పష్టంగా వివరించాక మరి దాచుకుని, నన్ను నేను మభ్యపెట్టుకుంటే నాకంటే దుర్మార్గురాలు మరొకరుండరు. నా ప్రియనేస్తం! నన్ను మనస్ఫూర్తిగా క్షమించు. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదనుకుంటే నేను హృదయపూర్వకంగా పశ్చాత్తాప పడుతున్నాను.

నన్ను అంగీకరించు
నీ స్నేహాన్ని నాకు మళ్ళీ అందించు
ఈ మానసిక క్షోభ నుంచి నన్ను రక్షించు.

అప్రయత్నంగా కన్నీరు చెంపల మీదుగా జారాయి.

మణి తట్టి పిలిచే వరకు ఈ లోకంలోకి రాలేదు.

"ఏమిటి?" అంది ఆదుర్దాగా మణి.

చిన్న నవ్వు నవ్వి "ఏమీ లేదు" అని చెంపలు తుడుచుకున్నాను.

"మొగుడు పిల్లలు గుర్తొచ్చారా?"

తల అడ్డంగా వూపి "శంకరమ్మ" అన్నాను.

"నిజం కదూ. భలే ఆవిడ"

నిజంగా భలే ఆవిడే. నా మనసును కమ్ముకున్న కారు మేఘాలను చేత్తో అలా తుడిచేసింది. నేను వొదులుకున్న నా ప్రియమైన స్నేహితురాల్ని మళ్ళీ కలిపింది. నిజమైన నా డ్యూటీ ఏమిటో నాకు తెలియపరిచింది.

ఇంటికి వెళ్ళగానే ముందు 'లత'కు వుత్తరం రాయాలి.

ఆ ఆలోచన మనసుపై పన్నీరు చిలికించింది.

కిటికీలోంచి వొచ్చిన చల్లని పైరగాలి నా చెవిలో గుసగుసలాడింది– "స్వీట్ ఫ్రెండ్స్ ఆర్ రేర్.. సో కీప్ దెమ్ విత్ కేర్"

కనపడని గాలికి చిరునవ్వుతో నమస్కరించాను.